# లంక గ్రామాల్లో కొత్తబంగారు లోకం

## ఆరుగురు ఇంజినీరింగ్ విద్యార్థుల కార్యాచరణ

**చదివింది ఇంజినీరింగ్... పొలాలు, పంటలు, అసలు గ్రామీణ ప్రాంతాలతో వారికి పరిచయం తక్కువే. అందరూ నగరాల్లో పుట్టి పెరిగిన వారే. కానీ వారి కలలన్నీ పల్లెలపైనే. అక్కడ కష్టాల్ని ఎదుర్కొనే పేదల పైనే. ఏదో ఒకటి చేయాలి. ఏది చేయాలన్నా ఒకరైతే కష్టం. ఒకరికి మరొకరు... వారికి ఇంకొకరు... ఇలా ఆరుగురు చేయి చేయీ కలిపారు. కలిసి కట్టుగా గ్రామాల వైపు అడుగేశారు. వారి ఆశలు, ఆశయాలకు రూపకల్పన చేశారు. ఇప్పుడు తొమ్మిది లంక గ్రామాల్లో ఆ ఆరుగురంటే జనాలకి అభిమానం. వారే హర్షవర్ధన్, దీపిక, సుమంత్, సౌరవ్, సోనమ్, తన్విజైన్... ఈ ఆరుగురి ఆలోచనా ప్రస్థానం ఎలా సాగిందంటే..**



పనులు గురించి చర్చించుకుంటున్న ఫౌండేషన్ సభ్యులు



గిడ్డంగి నిర్మాణం కోసం సేకరించిన స్థలం

కొల్లూరు, భట్టిప్రోలు - న్యూస్‌టుడే

ఆముదార్లంక గ్రామం. ఉండటానికి కృష్ణా జిల్లా గ్రామమైనా, గుంటూరు జిల్లాలో భాగమే. జార్ఖండ్‌లో పోలీస్ శాఖ ఐ.జి.గా పనిచేస్తున్న మండవ విష్ణుది ఈ గ్రామమే. ఎప్పటి నుంచో జార్ఖండ్‌లో స్థిరపడిన వీరి సంతానంలో హర్షవర్ధన్, దీపికలు బిట్స్‌పిలానీలో ఇంజినీరింగ్ చదువుతున్నారు. ఎప్పుడో ఒకసారి సొంత గ్రామం ఆముదార్లంక వచ్చినప్పుడు అక్కడి పరిస్థితులు, ప్రజల కష్టాలు వారిని కదిలించాయి. ఏదో ఒకటి చేయాలన్న తపన వారికి అప్పట్లోనే కలిగింది. పిలానీలో చదువుతూ విరివిగా ఆలోచించే సుమంత్, సౌరవ్, తన్విజైన్, సోనమ్‌ల కలయిక వారి ఆశయానికి మార్గం చూపింది. అందివచ్చిన ఆర్థిక సాయం ఆ ఆరుగురినీ కార్యరంగంలోకి దింపింది. వెంటనే కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని లంకగ్రామాలకు చేరుకుని కార్యాచరణ ప్రారంభించారు.



ఉపాధ్యాయుల బదిలీ వివరాలు ఆన్‌లైన్‌లో చూసుకుంటున్న ఉపాధ్యాయులు



కంప్యూటర్ శిక్షణలో పరిసర గ్రామస్థులు

### మొదటి చూపు సమస్యల పైనే..

గ్రామాల్లో అనేక సమస్యలుంటాయ్. వేటికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలనేది వారి సందేహం. దీనికోసం మూడు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. ఓ అయిదుగురు వృద్ధులు పింఛను లేక అవస్థలు పడటం, రైతులు పండించిన పంట నిల్వ ఉంచుకోవటానికి గిడ్డంగులు లేకపోవటం, భూసారం తగ్గి దిగుబడులు తగ్గిపోవటం వంటివి గుర్తించారు. దీనితో పాటు అసలు ప్రాపంచక విషయాలు, సమాచార వ్యవస్థ అందుబాటులో లేకపోవటమే వెనుకబడి ఉండటానికి అసలు కారణంగా తెలిసి దీనికి ప్రథమ ప్రాధాన్యమివ్వదలిచారు. మిగిలిన చిన్నవాటిని ప్రాధాన్య ప్రకారం పరిష్కరించేలా ప్రణాళిక రూపొందించారు.

### కంప్యూటర్ శిక్షణ... ఇంటర్‌నెట్

తొమ్మిది లంక గ్రామాలకు కేంద్రాలుగా ఉన్న జువ్వలపాలెం ప్రాథమిక పాఠశాలలో ఏడు కంప్యూటర్లు ఏర్పాటు చేసి శిక్షణ కార్యక్రమాన్ని యుద్ధప్రాతిపదికన ప్రారంభించారు. ఓ శిక్షకురాలిని ఏర్పాటు చేసి ఉచిత శిక్షణతో పాటు ఇంటర్‌నెట్ ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, రైల్వే, బస్ టిక్కెట్ల ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

### భూసార పరీక్షలు

లంక గ్రామాల్లో 40కి పైగా భూసార పరీక్షలు జరిపారు. దీనికోసం బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లను కలిసి వారి సహాయం కోరారు. వీరి ఉత్సాహాన్ని చూసి వారు అయిదుగురు కళాశాల సిబ్బంది వచ్చి పరీక్షలు నిర్వహించారు. జువ్వలపాలెంలో భూములు ఉప్పునీటి కారణంగా బీడు నేలగా మారాయని తెలియజెప్పారు. భట్టిప్రోలు మండలం పెసర్లంక, పెదలంక ప్రాంతాలలో జిప్సం జింకు లోపాలను గుర్తించి ఆదేరోజు రైతులకు సూచనలందించారు.

### 31న గిడ్డంగుల శంకుస్థాపన

లంక గ్రామాల్లో రూ. కోట్ల విలువైన పసుపు, కంద, అరటి, తమలపాకు, చెరకు, బొప్పాయి వంటి వాణిజ్య పంటలు పండుతున్నాయి. కానీ వీటికి గిట్టుబాటు ధర లేని రోజుల్లో కూడా నిల్వ ఉండే అవకాశం లేక తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వచ్చింది. దీనికోసం జువ్వలపాలెంలోనే ఎకరా విస్తీర్ణంలో రూ. 18 లక్షలతో గిడ్డంగులు నిర్మించాలని నిర్ణయించారు. మొదట రూ. 12 లక్షలతో శీతల గిడ్డంగిని నిర్మించాలని నిర్ణయించి, తర్వాత దానివల్ల ఉపయోగం తక్కువని తెలిసి గిడ్డంగుల నిర్మాణానికి ప్రాధాన్యమిచ్చారు. వీటి నిర్మాణానికి ఈనెల 31న శంకుస్థాపన చేయాలని ముహూర్తం నిర్ణయించారు. దీనికి అవసరమైన ఎకరా స్థలాన్ని జువ్వలపాలెం సర్పంచి శ్రీనివాసరావు అమ్మమ్మ విరాళంగా ఇచ్చారు.

### ఇంకా ఎన్నో సేవలు

వీరి సర్వేలో నలుగురు వృద్ధులు ఏ ఆధారం లేకుండా అవస్థలు పడటంపై నెలకు రూ. 400 ఒక్కో కుటుంబానికి సాయమందించటం అప్పుడే ప్రారంభించారు. భట్టిప్రోలు మండలం పెసర్లంకకు చెందిన ప్రసన్నకుమార్ అనే పేద విద్యార్థి పాలిటెక్నిక్ చదువుకు అవసరమైన ఫీజులు చెల్లించారు. ఇంకా హెల్త్‌కేర్ సెంటర్లు, రైతులకు రుణాలు ఇప్పించే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నామని వారు 'న్యూస్‌టుడే'కి చెప్పారు.

### నా కళ్ళ ముందు పుట్టి పెరిగిన పిల్లలేనా?



చదువుల్లో రాణిస్తూ, దొరికిన కొద్దిపాటి సెలవుల సమయంలో ఆనందంగా గడపకుండా 9 లంక గ్రామాల అభివృద్ధి కోసం వారు పడుతున్న తపన చూస్తుంటే వాళ్ళు నా కళ్ళ ముందు పుట్టి పెరిగిన పిల్లలేనా? అన్న ఆశ్చర్యం కలుగుతుందని హర్ష, దీపిక పెదనాన్న మండవ సుబ్బారావు ఆశ్చర్యం వ్యక్తపరిచారు. కుటుంబానికి, లంక గ్రామాలకు మంచి పేరు తెచ్చే ఆలోచన వాళ్ళకు రావటం, వెంటనే దానిని ఆచరణలో పెట్టటం విస్మయానికి గురిచేసిందన్నారు.

### ఆశయం నెరవేరనుంది



శాశ్వతంగా గుర్తుండి పోయేలా ఊరికి మంచిపని చేయాలనే ఆశ ఉండేది. అయితే ఏమిచేయాలో అర్థమయ్యేది కాదు. పరివర్తన్ ఫౌండేషన్ పిల్లలు నా దగ్గరికి వచ్చారు. రైతుల కోసం గిడ్డంగి నిర్మించనున్నట్లు చెప్పారు. వెంటనే ఎకరా భూమి దానంగా ఇచ్చాను. చిన్న వయసులోనే ఇటువంటి ఆలోచనలు రావటం, వాటిని విజయవంతం చేయటానికి వాళ్ళు పడుతున్న శ్రమ చూశాక నా ఆశయం నెరవేరనుందనే నమ్మకం ఏర్పడింది.

**- వేమాలపల్లి బసవపూర్ణమ్మ, జువ్వలపాలెం**

### తండ్రిని మించిపోయారు



జార్ఖండ్ రాష్ట్రంలో ఐ.జి.గా పనిచేస్తున్న మండవ విష్ణు ఆముదార్లంక పంచాయతీ అభివృద్ధికి పాటుపడేవారు. ఆయన పంచాయతీలో విద్యుత్తు సదుపాయం కోసం నగదు దానం చేశారు. ఇప్పుడు ఆయన పిల్లలు ఇరువురూ ఆయనను మించిపోయి భవిష్యత్తులో ఉపయోగపడే పనులు చేస్తున్నారు. వాళ్ళు ఏర్పాటు చేసిన కంప్యూటర్ శిబిరం వల్ల ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తు మారనుంది.

**- మన్నే భానుమూర్తి, ఆముదార్లంక**

### మొదట్నుంచీ సాయం చేసే భావం

హర్షకి మొదట్నుంచీ ఇతరులకు సాయం చేసే భావం ఉండేది. కానీ ఇంత మంచి పనులు చేసేంతగా ఎదుగుతాడని ఊహించలేదని హర్ష తాతయ్య నాయనమ్మలు మండవ వెంకటరత్నం, పుష్పవతి అన్నారు. వేసవి సెలవులకు వచ్చి వెళ్ళిపోయే అన్నా, చెల్లెలు ఊరి బాగు కోసం పాటుపడటం ఆనందానికి గురిచేస్తుందని అన్నారు. వారు భవిష్యత్తులో ఇంకా ఎదగాలని ఆనందం వ్యక్తం చేశారు.

